




ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



# జనం ముచ్చట

మంగళవారం, సెప్టెంబర్ 01, 2026 | తెలంగాణ | పేజీలు : 4




## ప్రజాసేవే..

ప్రజల సహకారంతో 100 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి...

రూ.12 కోట్లతో బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన...


ఖమ్మం పట్టణానికి తాగునీటి సమస్య లేకుండా రూ.250 కోట్లు...

24 గంటల మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం...

# జీవిత పరమావధి

ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యం,
ఖమ్మం రూపురేఖలు మార్చడమే నా ధ్యేయం..

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2 లో..

**ఖమ్మం,ఆగస్టు 31, జనం ముచ్చట :** ప్రజాసేవే తన జీవిత పరమావధి అని, ఖమ్మం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపడమే తన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పదవుల కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, ప్రజల ఆకాంక్షలు, ఒత్తిడి మేరకే రాజకీయాల్లో కొనసాగుతున్నానని ఆయన స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు.సోమవారం ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో కాటన్ మార్కెట్ నుంచి ప్రకాశ్‌నగర్ మీదుగా ఎస్‌వీఎం స్కూల్, దంసలాపురం రోడ్డు వరకు రూ.12 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పలు కీలక అంశాలపై మాట్లాడారు.



3లో..

## రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి: లింగాల కమల్ రాజు



3లో..

## ప్రారంభమైన దేవేంద్ర సామాజిక చైతన్య నాటకోత్సవాలు

ప్రేక్షకుల హృదయాలను తట్టి లేపిన 'అంబేద్కర్' నాటకం



## కాంగ్రెస్ సర్కార్‌కు...

# బీఆర్ఎస్ పార్టీ బిగ్ షాక్

**ఖమ్మం జిల్లా, జనం ముచ్చట:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంటున్న వేళ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వేడి మరింత పెరిగింది. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేస్తూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నేతృత్వంలో ప్రజల్లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ భారీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు, రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.....

**కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనే బీఆర్ఎస్ టార్గెట్...**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రత్యేక ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ప్రజా కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది.

రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనపై ఛార్జ్‌షీట్...

సెప్టెంబర్ 1 నుంచి కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం..

హామీలు,వైఫల్యాలపై ప్రజల్లోకి నాయకులు,శ్రేణులు...



2 లో..

# ప్రజాసేవే జీవిత పరమావధి : మంత్రి తుమ్మల

(మొదటి పేజీ తరువాయి)



**ఖమ్మం ప్రజల రుణం అభివృద్ధితో తీర్చుకుంటా....**

ఖమ్మం ప్రజలు తనపై ఉంచిన నమ్మకం, ఆదరణకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని మంత్రి తుమ్మల అన్నారు. ప్రజలు ఇచ్చిన గౌరవానికి, అభిమానానికి అభివృద్ధి రూపంలో రుణం తీర్చుకుంటానని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు కోరిన, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయ వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అందరి సహకారంతో ఖమ్మం నగర రూపురేఖలను మార్చుతామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతూ ఖమ్మంను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు....

**హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం ఖమ్మం...**

హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం ఖమ్మమేనని మంత్రి తుమ్మల అన్నారు. ఖమ్మం పట్టణాన్ని రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తమ ఏకైక కోరిక అని చెప్పారు. రవాణా సౌకర్యాలు, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీలు, విద్య, వైద్యం, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు.

**100 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా రోడ్ల అభివృద్ధి...**

ఖమ్మం నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలందరూ అంగీకరిస్తే రానున్న 100 సంవత్సరాల భవిష్యత్ అవసరాలకు సరిపడేలా రోడ్ల వెడల్పు, మౌలిక వసతుల అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని అన్నారు. ప్రస్తుతం చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీ, ప్రభుత్వ భవనాలు, ఇతర మౌలిక వసతుల పనులు భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. ప్రభుత్వం నిర్మించిన అభివృద్ధి పనులను సక్రమంగా నిర్వహించి, సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనా ఉందని మంత్రి సూచించారు....

**ఖమ్మానికి తాగునీటి సమస్య లేకుండా రూ.250 కోట్లు....**

ఖమ్మం పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.250 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి తుమ్మల తెలిపారు. పట్టణంలో అవసరమైన చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి ప్రజలకు 24 గంటల పాటు మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించి ప్రతి కుటుంబానికి నిరంతర నీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.....

**రైతులు, రైతు కూలీల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత....**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తుమ్మల అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. రైతుల అవసరాలను గుర్తించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. అదే సమయంలో ఖమ్మం నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు....

**కబ్జాలు, దౌర్జన్యాలకు తావులేకుండా శాంతిభద్రతలు కట్టుదిట్టం....**

ఖమ్మం పట్టణంలో దౌర్జన్యాలు, కబ్జాలు, అక్రమ కేసులకు ఎలాంటి తావు లేకుండా శాంతిభద్రతలను పరిరక్షించాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. తప్పు చేసిన వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడాలని, అదే సమయంలో ఎలాంటి తప్పు చేయని అమాయకులు, పేద ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతల్లో ఒకటని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూనే సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.....

**అభివృద్ధి పనులను ప్రజలు సంరక్షించుకోవాలి....**

ఖమ్మం పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించే అభివృద్ధి పనులను సక్రమంగా నిర్వహించి, సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా పనులు చేపట్టాలని సూచించారు.

**అందరి సహకారంతో ఖమ్మం అభివృద్ధి....**

ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి ఒక్కరి వల్ల సాధ్యం కాదని, ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని రాజకీయ వర్గాలు, ప్రజల సమష్టి సహకారంతోనే నగరాన్ని మరింత అభివృద్ధి చేయగలమని మంత్రి తుమ్మల అన్నారు. ఖమ్మం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని మరింత సుందరంగా, అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య,ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు....

---

## కాంగ్రెస్ సర్కార్‌కు...

# బీఆర్ఎస్ పార్టీ బిగ్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన 420 హామీలు,13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీలను ప్రజల ముందుంచి.. వాటిలో ఎన్ని అమలయ్యాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? అనే అంశాలపై ప్రజలకు వివరించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది.....

**'బాకీ కార్డుల'తో ప్రజల్లోకి....**

కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అందులో భాగంగా రైతులు, వ్యవసాయ కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు తదితర వర్గాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను ప్రజలకు గుర్తుచేసేలా 'బాకీ కార్డులు' ను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకురావాలని పార్టీ నిర్ణయించింది. ప్రతి వర్గానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఆయా వర్గాల సమస్యలను ఎత్తిచూపనున్నారు.. అదే విధంగా రైతులకు సంబంధించిన అంశాలపై కూడా బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా టార్గెట్ చేస్తోంది.రైతుబంధు నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందని, ఇప్పటివరకు రైతులకు సంపూర్ణ రుణ మాఫీ కాలేదని పువ్వాడ అజయ్ కుమార్ గతంలో విమర్శించారు. అంతే కాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు.రైతులకు సంబంధించి అన్ని అంశాలను పార్టీ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనుంది....

**యువతకు ఉద్యోగాలు ఎక్కడ?**

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీపై కూడా బీఆర్ఎస్ కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తోంది. ఉద్యోగాల భర్తీ, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించాలని పార్టీ నిర్ణయించింది. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లకు పైగా ఉన్నాయని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అంశాన్ని విద్యార్థులు, విద్యాసంస్థల మధ్య విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ భావిస్తోంది.. అదే విధంగా బీఆర్ఎస్ ప్రకటించిన కార్యాచరణలో ఒక్క రైతుల సమస్యలే కాకుండా సమాజంలోని వివిధ వర్గాలను టార్గెట్ చేయనున్నారు. మహిళలు, ఆటో డ్రైవర్లు, గిరిజనులు, దళితులు, బీసీలు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తదితర వర్గాలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామం, వార్డు స్థాయిలో పార్టీ నాయకులు ప్రజలను కలవాలని కేటీఆర్



సూచించినట్లు సమాచారం.....

**ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో నిలదీత...**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిందని బీఆర్ఎస్ గుర్తుచేస్తోంది. అయితే వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఆ హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అంశాన్ని అసెంబ్లీ వేదికగానూ, ప్రజాక్షేత్రంలోనూ గట్టిగా లేవనెత్తాలని పార్టీ నిర్ణయించింది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అంశంపై ప్రైవేట్ మెంబర్ బిల్లును కూడా తీసుకురావాలని బీఆర్ఎస్ గతంలో ప్రకటించింది... అలాగే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీని కూడా బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. హామీలకు అనుగుణంగా ప్రయోజనాలు అందుతున్నాయా? అనే అంశాన్ని ప్రజల్లో చర్చకు తీసుకెళ్లాలని పార్టీ భావిస్తోంది. అదే విధంగా మూసీ నది పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో పేదలు, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని కేటీఆర్ ఇప్పటికే స్పష్టం చేశారు. భారీ వ్యయంతో చేపట్టే ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ఉద్యోగుల బకాయిల విషయంలో మాత్రం నిధుల కొరతను ఎందుకు ప్రస్తావిస్తోందని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది...

**రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు....**

ఈసారి ఉద్యమాన్ని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ హామీలు, అమలు తీరుపై వివరిస్తారు. సోషల్ మీడియాను కూడా విస్తృతంగా వినియోగించి యువతకు ప్రభుత్వ పాలనపై తమ వాదనను చేరవేయాలని పార్టీ నాయకత్వం సూచించింది....

**కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్..మళ్లీ హీటెక్కిన ఖమ్మం జిల్లా రాజకీయం....**

మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంటున్న తరుణంలో బీఆర్ఎస్ ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించే అవకాశం కనిపిస్తోంది. ఒకవైపు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తన పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందుంచేందుకు సిద్ధమవుతుండగా.. మరోవైపు గత ఎన్నికల హామీలను అస్త్రంగా చేసుకుని ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ సిద్ధమవుతోంది.. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ పెట్టిన 'ఛార్జ్‌షీట్' ఎంతవరకు ప్రజల్లో ప్రభావం చూపుతుంది? బీఆర్ఎస్ ఉద్యమానికి ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

## లింగాల కమల్ రాజు



మధిర, జనం ముచ్చట

ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారంటీల పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజులు దాటినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారంటీలను నమ్మిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారని, అయితే అధికారంలోకి వచ్చిన అనంతరం హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కమల్ రాజు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

**హామీలను వెంటనే అమలు చేయాలి**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల్లో ముఖ్యమైన వాటిని వెంటనే అమలు చేయాలని కమల్‌రాజు డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వృద్ధులు, వితంతువులకు రూ.4,000 పెన్షన్, రైతులు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలు, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఇందిరమ్మ ఇళ్ల హామీ వంటి అంశాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకోవడమే నిజమైన ప్రజా పాలనకు నిదర్శనమని ఆయన అన్నారు."ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కాదు.. ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన ప్రజా పాలన" అని లింగాల కమల్ రాజు పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు, పేదలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థుల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని కమల్‌రాజు గుర్తు చేశారు. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, ఆసరా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, మిషన్ భగీరథ వంటి పథకాలను అమలు చేశామని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చూపాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా ఆరు గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరఫున ప్రశ్నించేందుకు రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ పలు పోరాట కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని కమల్ రాజు తెలిపారు. రాష్ట్ర పార్టీ నిర్ణయించిన కార్యాచరణను మధిర నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు వివరించి, ప్రజా సమస్యలపై పోరాటానికి ప్రతి కార్యకర్తను సిద్ధం చేస్తామని అన్నారు.

గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, ప్రతి గ్రామంలో ప్రజలను కలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

**ప్రజా సమస్యలపై గ్రామస్థాయి పోరాటం**

మధిర నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారం కోసం పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తామని కమల్ రాజు తెలిపారు. రైతులు, రైతు కూలీలు, యువత, మహిళలు, వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

అవసరమైతే ప్రజలను కలుపుకొని ప్రజా ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ శ్రేణులు నిరంతరం ప్రజల్లో ఉండాలని సూచించారు.

**ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలి....**

రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించిన కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని కమల్‌రాజు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై చురుకుగా పనిచేస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తామని ఆయన అన్నారు. మధిర నియోజకవర్గంలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తారని తెలిపారు.ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ నిలుస్తుందని లింగాల కమల్ రాజు స్పష్టం చేశారు.

# ప్రారంభమైన దేవేంద్ర సామాజిక చైతన్య నాటకోత్సవాలు

## ప్రేక్షకుల హృదయాలను తట్టి లేపిన 'అంబేద్కర్' నాటకం



ఖమ్మం, ఆగస్టు 31: జనం ముచ్చట

ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రముఖ రచయిత, నంది అవార్డు గ్రహీత దేవేంద్ర రచించిన మూడు రోజుల సామాజిక చైతన్య నాటకోత్ వాలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. సమాజంలో నెల కొన్న అసమానతలు, సామాజిక పరిణామాలను ప్రజలకు అర్థమయ్యే రీతి లో చైతన్యపరిచే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ నాటకోత్సవాలకు విశేష స్పంద"న లభించింది. కార్యక్రమాన్ని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు, మాజీ శాసనసభ్యులు తమ్మినేని వీరభద్రం, ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోపీ నాథ్, ప్రముఖ సాహితీవేత్త జీవన్ లు లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభ సూచకంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**అంబేద్కర్ గీతాలతో ప్రారంభం....**

నాటక ప్రదర్శనకు ముందు రచయిత దేవేంద్ర రచించిన అంబేద్కర్ గీతాల ను కళాకారులు ఆలపించారు. అనంతరం అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు సిద్ధోజి, కార్యదర్శి ఎం. జగ్గరాజు, రచయిత దేవేంద్రలు 'అంబేద్కర్' నాటక ప్రాధాన్యతను వివరించారు. ప్రస్తుత సమాజంలో చోటుచేసుకుంటున్న అనేక పరిణామాలను సరైన కోణంలో అర్థం చేసుకోవడానికి అంబేద్కర్ జీవితం, ఆయన ఆలోచనా విధానం, సామాజిక పోరాటాలను ప్రతిబింబించే ఈ నాటకం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే నాటకోత్సవాలను అన్ని వర్గాల ప్రజలు వీక్షించి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

**835 ప్రదర్శనలు పూర్తి చేసిన 'అంబేద్కర్'...**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితం, ఆయన సామాజిక ఉద్యమం, సమాజ మార్పు కోసం చేసిన కృషిని నేపథ్యంగా చేసుకుని దేవేంద్ర రచించిన 'అంబేద్కర్' నాటకం ఇప్పటికే 835 ప్రదర్శనలు పూర్తి చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ భాషల్లోకి ఈ నాటకాన్ని అనువదించి దేశవ్యాప్తంగా ప్రదర్శించినట్లు వెల్లడించారు.

బహుళ ప్రాచుర్యాన్ని, ప్రజాదరణను పొందుతున్న ఈ నాటకాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. నాటకం ద్వారా అంబేద్కర్ ఆశయాలను, సామాజిక సమానత్వ సందేశాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు....

**ప్రేక్షకులను కదిలించిన అంబేద్కర్ నాటకం....**

ప్రారంభ కార్యక్రమం అనంతరం ప్రదర్శించిన 'అంబేద్కర్' నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అంబేద్కర్ జీవితం, ఆయన ఎదుర్కొన్న సామాజిక పరిస్థితులు, సమానత్వం కోసం సాగించిన పోరాటం వంటి అంశాలను నాటక రూపంలో కళాకారులు ఆవిష్కరించడంతో ప్రేక్షకులు భావోద్వేగానికి గురయ్యారు.నాటకంలోని పలు సన్నివేశాలు ప్రేక్షకుల హృదయాలను తట్టి లేపగా, సామాజిక చైతన్యాన్ని రేకెత్తించే విధంగా సాగిన ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. నాటకం ముగిసిన అనంతరం కళాకారులను ప్రేక్షకులు అభినందించారు....

**భారీగా హాజరైన సామాజిక, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు...**


నాటకోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి వివిధ సామాజిక సంఘాలు, ప్రజా సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, సాహితీ సంఘాల నాయకులు, ప్రతినిధులు, కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అంబేద్కర్ ఆలోచనలు, సామాజిక సమానత్వం, ప్రజల్లో చైతన్యం వంటి అంశాలపై నాటక రూపంలో అవగాహన కల్పిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని నిర్వాహకులు కోరారు.మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ సామాజిక చైతన్య నాటకోత్సవాల్లో మరిన్ని ప్రదర్శనలు ఉండనున్న నేపథ్యంలో ఖమ్మం నగర ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కళాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు....

# గౌడ సంక్షేమ భవన్ నిర్మాణానికి భూమిపూజ చేసిన మంత్రి తుమ్మల

ఖమ్మం: జనం ముచ్చట

గౌడ సామాజిక వర్గం సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్మించనున్న గౌడ సంక్షేమ భవన్ నిర్మాణ పనులకు తెలంగా ణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వం౯రావు భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం సబ్‌స్టేషన్ ఎదు రుగా తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం గౌడ సంఘానికి కేటాయించిన 30 గుంటల స్థలంలో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో గౌడ సంక్షేమ భవన్‌ను నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు.

గౌడ సంఘానికి ప్రత్యేకంగా సంక్షేమ భవన్ నిర్మాణం చేపట్టడం పట్ల సంఘం నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ భవనం భవిష్యత్తులో గౌడ సామాజిక వర్గానికి చెందిన వివిధ కార్యక్రమాలు, సమావేశాలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడుతుం దని నాయకులు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భారీ




వ్యయంతో భవనం నిర్మాణం చేపట్టడం గౌడ సంఘం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.....

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్, హస్తకళల కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు గౌడ్, అలాగే GOPA ఖమ్మం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు గౌడ్, ప్రధాన కార్యదర్శి బొలగాని శ్రీనివాసరావు గౌడ్, తెలంగాణ గౌడ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ గౌడ్, ప్రధాన కార్యదర్శి మార్కం లింగ య్యగౌడ్, మోకు దెబ్బ నాయకులు బండి నాగేశ్వరరావుగౌడ్, బిచ్చాల తిరుమలరావు గౌడ్, బోయినపల్లి లక్ష్మణ్ గౌడ్, ఊడుగు రమేష్ గౌడ్, రడం సురేష్ గౌడ్,సంపేట ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గౌడ సంక్షేమ భవన్ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ఖమ్మం జిల్లా గౌడ సంఘం నాయకులు, సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. సామాజిక వర్గం అవసరాలకు అనుగుణంగా భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.



# సర్ -2026 హియరింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

### మున్సిపల్ కమిషనర్

### ఏరో, అదనపు ఏరో లతో హియరింగ్ ప్రక్రియపై సమీక్ష

ఖమ్మం, జనం ముచ్చట

ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఏరో లు, అదనపు ఏరో లతో సర్ -2026 హియరింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హియరింగ్ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో నమోదైన కేసులు, క్లియర్ చేసిన ఫైల్స్, పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ వివరాలను ఏరో ల వారీగా కమిషనర్ సమీక్షించారు. హియరింగ్ అనంతరం సంబంధిత ఫైల్‌ను అదే రోజున ఎరో లాగిన్‌లో క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, హియరింగ్ సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, ఓటర్ల వివరాల వెరిఫికేషన్‌లో తలెత్తుతున్న ఇబ్బందులు, వాటిని ఏ విధంగా పరిశీలిస్తున్నారు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అప్రూవల్‌లోనూ ఏరో అబ్జర్వేషన్ తప్పనిసరిగా నమోదు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు నమోదైన ఎంట్రీలు, పూర్తయిన ఎంక్వయిరీలు, పెండింగ్ అంశాలపై ఏరో లు, అదనపు ఏరో లతో సమగ్రంగా సమీక్షించారు. సర్ -2026 హియరింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా, నిబంధనల ప్రకారం పారదర్శకంగా, ఖచ్చితత్వంతో ప్రక్రియను పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా అంచనాల కమిటీ పగ్గాలు చేపట్టిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లందు, జనం ముచ్చట

తెలంగాణ రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమ వారం హైదరాబాద్‌లోని రాష్ట్ర శాసనసభ కార్యాల యంలో ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులు, ప్రభుత్వ వ్యయాలపై సమగ్ర పర్యవేక్షణ, ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో కీలక బాధ్యతలు నిర్వహి ంచే అంచనాల కమిటీకి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్ట డం ఇల్లందు నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మె ల్యే కోరం కనకయ్య అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ హాజరై సమావేశాన్ని పర్యవేక్షించారు. సమా వేశంలో రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులు, వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, బడ్జెట్ అంచనాలు, ప్రభుత్వ వ్యయాల సమర్థ వినియోగంపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు మరింత మెరుగైన పాలన, అభివృద్ధి ఫలాలు చేరేలా తీసుకోవాల్సిన చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

### ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు

ఖమ్మం ,జనం ముచ్చట

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు జిల్లాలో ఉన్న విద్య, వైద్య, ఇతర అంశాలను సూచిస్తూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, జిల్లా పరిధిలో సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు.

కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామ పంచాయతీకి చెందిన సంతోష్ లకావత్ గ్రామంలో ప్రత్యేక అధికారి పాలన కాలంలో సుమారు 9 లక్షల రూపాయల వరకు జరిగిన బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ, ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిప్యూటీ సీఈఓ ఖమ్మంకు రాస్తూ సెప్టెంబర్ 9 నాటికి విచారణ జరిపి రిపోర్టు



సమర్పించాల్సిందిగా అదనపు కలెక్టర్ ఆదేశించారు.

కల్లూరు మండలం తాళ్లూరి వెంకటాపురం గ్రామానికి చెందిన పాశం నాగేశ్వరరావు తన కుమార్తె పాశం ప్రియమణిని లంకపల్లి బిసి గురుకులం నుంచి రెబ్బవరం బీసీ గురుకులం పాఠశాలకు మార్చాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బిసి సంక్షేమ అధికారికి రాస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు.

తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువు గ్రామానికి చెందిన జోగుపర్తి బుచ్చమ్మ తన భర్త మరణించిన తర్వాత తనకు తెలియకుండా భర్త పేరు మీద ఉన్న ఆరు ఎకరాల 30 గుంటల భూమి తన కుమారుడు, కోడలు వారి పేరు మీద పాస్ పుస్తకం చేయించుకున్నారని, ఇప్పుడు తన సంరక్షణకు కూడా ఎటువంటి సహాయం చేయడం లేదని తన పోషణ పరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు పాల్గొన్నారు.

# సర్ హియరింగ్‌కు పోటెత్తిన ఓటర్లు

నేలకొండపల్లి, జనం ముచ్చట




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం సర్ కింద నోటీసులు అందుకున్న వారంతా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలకు వరస కడుతున్నారు. తొలుత మ్యాపింగ్ కాని ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు కార్డులను తీసుకురమ్మని సూచించటంతో ఆధారాలతో హియరింగ్ కు హాజరవుతున్నారు. సోమవారం ఆచార్లగూడెం, కట్టుకాచారం, మంగాపురంతండా, శంకరగిరితండా గ్రామాలలో హియరింగ్ కార్యక్రమమును నిర్వహించారు. మంగాపురంతండా లో 86 మందికి నోటీసులు ఇవ్వటంతో అంతా హాజరయ్యారు. వీరి కోసం కుటుంబ సభ్యులు కూడ రావటంతో జనసందడిగా మారింది. ఈ కార్యక్రమంలో మంగాపురంతండా గ్రామ సర్పంచ్ ధీరావత్

ఆశోకరాణి, మత్స్య సోసైటీ ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి తదితరులు హాజరూయ్యారు. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక కౌంటర్ల ను ఏర్పాటు చేశారు. నోటీసులకు అవసరమైన ఆధార పత్రాలను బీఎల్వో లు, సహాయ ఎన్నికల అధికారుల సమక్షంలో ఓటర్ల ఫోటోలను వారిచ్చిన పత్రాలను మొబైల్ లోని ప్రత్యేక యాప్ లో పొందుపరుస్తున్నారు. నాలుగు రకాల ఆధారాలు తీసుకురావాలని చెప్పటంతో వాటిలో ఆయా కేంద్రాలకు ఓటర్ల తమ కుటుంబ సభ్యులతో తరలివస్తున్నారు. దీంతో ఆయా కేంద్రాల వద్ద సందడిగా మారింది. శంకరగిరితండాలో నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య, మంగాపురంతండా లో డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, ఆచార్లగూడెం లో యంపీవో శ్రీనివాసరావు, కట్టుకాచారం లో స్థానిక యంఈవో బి.చలపతిరావు లు హియరింగ్ కు హాజరై పత్రాలను స్వీకరించారు.

# మైనారిటీ అభ్యర్థులు ఉచిత టీజీపీఎస్సీ గ్రూప్స్ ఫౌండేషన్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్

ఖమ్మం, జనం ముచ్చట

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో టీ జీ పీ ఎస్ సీ గ్రూప్-1 ప్రిలిమ్స్, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు హైదరాబాద్ కేంద్రంగా ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ మైనారిటీ వర్గాలకు చెందిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

ఈ ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పని సరిగా డిగ్రీ విద్యార్హత పూర్తి చేసి ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 14 లోగా తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

అభ్యర్థులు తమ దరఖాస్తులను తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల భవన సముదాయం, ఎం.ఏ.ఎం. క్యాంపస్, ఇంటర్మీడియట్ బోర్డు వెనుక, శ్రీ బాలాజీ ఎన్‌క్లేవ్, గోషామహల్, నాంపల్లి, హైదరాబాద్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.